క్లుప్తంగా

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



పాదయాత్ర ద్వారా ఆలయానికి చేరుకున్న శ్రీనివాస్‌రెడ్డి, ఆయన అనుచరులు

గుంతకల్లు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటూ వైఎస్సార్‌సీపీ అభిమాన సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి జగన్ మరోసారి సీఎం కావడంతో పాటు ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలని ఆయన ఆధ్వర్యంలో పెన్నహోబిలం పుణ్యక్షేత్రం నుంచి ఐదు రోజుల క్రితం పాదయాత్ర చేపట్టారు. మంగళవారం సాయంత్రం కసాపురం ఆలయానికి చేరుకున్న వారి బృందం ఆలయంలో పూజలు నిర్వహించారు.

కాళమ్మ విగ్రహంపై సూర్యకిరణాలు



పూజలు చేస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న కాళమ్మ దేవాలయంలో మంగళవారం ఉదయం మూల విరాట్‌పై సూర్య కిరణాలు ప్రసరించాయి. ప్రతి సంవత్సరం మార్చి మొదటి వారంలో రెండు రోజుల పాటు సూర్యకిరణాలు కాళమ్మ దేవతపై పడటం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి విగ్రహంపై సూర్య కిరణాలు పడటంతో భక్తులు పూజలు నిర్వహించారు.

శ్మశానానికి దారి ఏర్పాటు

తాడిపత్రిటౌన్: మండలంలోని చుక్కలూరు వరదాయపల్లిలో శ్మశానికి దారి ఏర్పాటు చేశారు. కొంత కాలంగా శ్మశానంలో విపరీతంగా ముళ్లపొదలు పెరగడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సొంత నిధులు వెచ్చించి, జేసీబీ సాయంతో ముళ్ల పొదలను తొలగించి శ్మశానానికి దారి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె శంకర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పనులను పర్యవేక్షించారు.

బలిజ సంఘం నాయకుడి మృతి



టపాల నారాయణ స్వామి (ఫైల్)

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో నివాసముండే బలిజ సంఘం మండల మాజీ ఉపాధ్యక్షుడు టపాల నారాయణస్వామి(80) సోమవారం రాత్రి మృతి చెందారు. బలిజ సంఘం పట్టణ, మండల అధ్యక్షులు శ్రీకరం హరి, బండి సత్య, ఉపాధ్యక్షుడు శ్రీకరం గోవిందరాజులు, బలిజ సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు కందుల హేమలత తదితరులు సంతాపం ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రైళ్లు, ప్లాట్ ఫారాలపై తనిఖీ

గుత్తి: గుత్తి, జక్కలచెరువు, రాయలచెరువు, పాత కొత్తచెరువు రైల్వే ప్లాట్ ఫారాలు, రైళ్లలో జీఆర్‌పీ పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీ నిర్వహించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రయాణికుల బ్యాగులు చెక్ చేశారు. ప్లాట్ ఫారాలపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. రైళ్లలో, ప్లాట్ ఫారాలపై ఎలాంటి చోరీలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోండి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సిబ్బంది

గుంతకల్లుటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వజ్రాయుధం లాంటి ఓటును వినియోగించుకోవాలని సెక్టోరల్ ఆఫీసర్లు జీవీఎస్ రాజు, డాక్టర్ మంజునాథ్ సూచించారు. మంగళవారం సాయంత్రం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత ఎన్నికల్లో అత్యల్ప పోలింగ్ నమోదైన తొమ్మిది కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఓటు విశిష్టత, ఈవీఎంలో ఓటు హక్కు వినియోగం, పోలింగ్ శాతం పెంపునకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు సభలు నిర్వహించారు. సరోజినీనాయుడు గరల్స్ హైస్కూల్, సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూళ్ల పరిధిలోని తొమ్మిది పోలింగ్ బూత్‌ల ఓటర్లతో పాటు సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రజలకు వరం ‘వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు’



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు గోపాల్ రెడ్డి. ఊరు మర్తాడు. గతంలో ఏదైనా జబ్బు చేస్తే గ్రామం నుంచి గార్లదిన్నెలో ప్రైవేట్ ఆస్పత్రికి కానీ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునేవాడు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించడంతో సొంత గ్రామంలోనే పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు పొందుతున్నాడు. హెల్త్ క్లినిక్‌లో ల్యాబ్ సౌకర్యం కూడా ఉండడంతో అన్ని రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. అలాగే మందులు సైతం ఉచితంగా అందజేస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశాడు. ఉన్న ఊళ్లోనే వైద్య సేవం దుతుండడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



కనంపల్లిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం



కొప్పలకొండ హెల్త్ క్లినిక్‌లోని ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యం

- ఒక్కొక్క హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ.17.50 లక్షలు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామీణులు

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయ సముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు గ్రామీణులకు వరంలా మారాయి. గతంలో చిన్న జబ్బు చేస్తే మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 2,500 జనాభాకు ల్యాబ్ సౌకర్యంతో పాటు 10 పడకలు ఉండేలా నూతన భవనాలు నిర్మించి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నాయి. ప్రభుత్వం ఒక్కో హెల్త్ క్లినిక్‌కు రూ.17.50 లక్షలు వెచ్చించి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా సొంత గ్రామంలోనే వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే చిన్న పిల్లలు, వృద్ధులకు జబ్బు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లితే డబ్బులు ఎక్కువగా ఖర్చు అయ్యేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా సత్వరమే ఉచిత వైద్యం అందుతోంది. అలాగే దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

హెల్త్ క్లినిక్‌లో సేవలు ఇలా

- 65 రకాల వైద్య పరీక్షలు ఉచితం.
- ప్రభుత్వం 206 రకాల మందులను అందుబాటులో ఉంచింది.
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ వైద్యాధికారి వైద్య సేవలు అందిస్తారు.
- ప్రతి సోమవారం ఒక స్పెషలైజేషన్ వైద్యుడి సేవలుంటాయి.
- బీపీ , షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులకు ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగనవసరం లేకుండా హెల్త్ క్లినిక్‌లో పరీక్షలు చేస్తారు.

శింగనమల నియోజక వర్గంలో ఇలా

మండలం	వైఎస్సార్ హెల్త్ సెంటర్లు
శింగనమల	10
గార్లదిన్నె	11
బీకేఎస్	7
నార్పల	9
పుట్లూరు	11
యల్లనూరు	10
మొత్తం	58

అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నాం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులకు ల్యాబ్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. అలాగే రోగులకు చికిత్స చేయడానికి పడకలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

– డాక్టర్ గౌతమి, గార్లదిన్నె పీహెచ్‌సీ

గ్రామంలోనే వైద్యం



వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో ప్రజలకు సొంత గ్రామంలోనే సత్వరమే ఉచిత వైద్యం అందుతోంది. గతంలో ఆస్పత్రికి వెళ్లడానికి ఇబ్బందులు పడేవాళ్లం. చిన్న జబ్బు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే డబ్బులు ఎక్కువగా ఖర్చయ్యేవి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది.

– సురేష్, శిరివరం

అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ లబ్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీలో, సాయంత్రం పిన్నేపల్లెలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలు, పార్టీల కతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఏపీలో మినహా దేశంలో మరెక్కడా లేదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పుట్టినరోజు సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి చేత కేక్ కట్ చేయించి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, భాస్కర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అల్పాహారం, బ్రెడ్డు పంపిణీ

తాడిపత్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగులకుంట కేశవరెడ్డి ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం మహాత్మాగాంధీ ఆర్య వైశ్య సేవా సమితి సభ్యులు అల్పాహారం అందజేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అల్పాహారం, బ్రెడ్డు పంపిణీ చేశారు. నాయకులు వేణు, వినోద్, ప్రభాకర్, భూపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం





పేదలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని, కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన లబ్ధిదారులు

గుంతకల్లుటౌన్: పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టణంలో ఇంటి స్థలం పొందిన 5,571 మంది లబ్ధిదారులకు ఆయన ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలను సొంత తోబుట్టువులుగా భావించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి.. వారి పేరిట లక్షలాది రూపాయల విలువ చేసే ఆస్తిని అందజేశారన్నారు. ఒక సెంటు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం దాదాపు రూ.27 వేలు ఖర్చవుతుందని, అయినా నయా పైసా లేకుండా అక్కచెల్లెమ్మల పేరిట రిజిస్ట్రేషన్ చేసిచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఓట్ల కోసం మీ ముందుకు వస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారులే జగనన్న స్టార్ క్యాంపెయినర్లన్నారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పేదప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

గుంతకల్లులో రౌడీలకు చోటు లేదు

గుంతకల్లు ప్రశాంతతకు మారు పేరు. నియోజకవర్గ ప్రజలు చాలా విజ్ఞులు. ఇక్కడ శాంతికి తప్ప రౌడీలు, దౌర్జన్యపరులకు చోటు లేదంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీపై ఇక్కడి టీడీపీ నేతలకు గెలిచే సత్తా లేదని భావించిన టీడీపీ అధినేత పక్క జిల్లాలో ఊడ్చిపడేసిన కసువును గుంతకల్లుకు తెచ్చి పోటీలో నిల్చోబెడతాడంట. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కసువు(చెత్త) కావాలా? లేక కమ్మర కట్ట(స్వీట్ బర్ఫీ) కావాలో ప్రజలే నిర్ణయించాలన్నారు. ఏ రాజకీయ నాయకుడైనా ఓ కులాన్ని నమ్ముకోకూడదన్నారు. వైఎస్సార్‌సీపీకి కులం లేదని, మానవత్వంతో ప్రజలకు సేవలందించాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అభిమతమన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, కమిషనర్ పి.వెంకటరమణయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, ఏసీపీ అబ్దుల్‌సత్తార్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మురళీ, వేల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పామిడి: పామిడితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలోని గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్‌హెల్త్ క్లినిక్‌కు సంబంధించి నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఓబుళాపురంలో నీటి శుద్ధ ఫ్లాంట్ ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు అనిమిరెడ్డి ఫ్యాక్టరీ ఎదురుగా లేఅవుట్‌లో 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అలాగే వంకరాజుకాలువ గ్రామంలోని సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం



నార్పలలో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల/గార్లదిన్నె: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం వారు నార్పల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించి జగనన్న ప్రజలకు అందిస్తున్నా సంక్షేమ పథకాలను వివరించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులు గ్రామాల్లోని రచ్చబండల వద్ద పడిగాపులు కాసేవారన్నారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల సాయంతో లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ అందిస్తున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం బాగుటుందన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు ఉంటాయన్నారు. ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాన్ని పటించుకోకుండా జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, నాయకులు మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, డొక్కా క్రిష్ణా, ఎంపీటీసీ శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- గార్లదిన్నె మండలంలోని ఇల్లూరు, కేశవాపురం, కొప్పలకొండ, పెనకచెర్ల గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం ఇల్లూరులో పర్యటించిన సమన్వయకర్త వీరాంజనేయులు

క్రైం వార్తలు

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని జి.వెంకటాంపల్లి మీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.2,680 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మండల కేంద్రంలో మట్కా రాస్తున్న సంతోష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.10 వేల నగదు, చీటీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

గుడి గంటలు చోరీ

గార్లదిన్నె: మండలంలోని కొట్టాలపల్లిలో ఉన్న సుంకలమ్మ, రాములమ్మ ఆలయాల్లోని గుడి గంటలు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం చోరీ చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

బైక్ బోల్తా: ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో మంగళవారం బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌ను డ్రైవ్ చేస్తున్న ఆర్ఎస్‌లోని తోళ్లషాపు కాలనీకి చెందిన శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యువకుడి అదృశ్యం



శివశంకర్

గార్లదిన్నె: మండలంలోని పి.కొత్తపల్లి సోమవారం రాత్రి ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన శివశంకర్ అనే యువకుడు సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మంగళవారం సా యంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో నివాసముండే కాసుల మాధవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. వివరాలు.. మాధవి దేవాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఇద్దరు దుండగులు బైక్‌లో వచ్చి ఆమె మెడలోని బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లారు. ఘటనపై భర్త కాసుల ప్రసాద్‌తో కలసి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో తాడిపత్రి– అనంతపురం రహదారిలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అధిక లోడుతో వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టారు.

కేసు నమోదు

యాడికి: మండలంలోని భోగాలకట్ట గ్రామంలో ఆదివారం ఇంటి వద్ద ఉన్న మహిళపై అదే గ్రామానికి చెందిన బాబయ్య తాగి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. మంగళవారం బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బాబయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

విద్యార్థికి అంత్యక్రియలు

యాడికి: మండలంలోని కుందనకోట గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి పెద్దిరాజులు మహాబలిపురం వద్ద సముద్రంలో గల్లంతై మృతిచెందిన విషయం విదితమే. విద్యార్థి మృతదేహం మంగళవారం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. అనంతరం అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



యల్లనూరులో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, తహసీల్దారు జయప్రసాద్



శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీలో ఇంటి పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సునీతమ్మ

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం 106 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలను మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమోతి, ఉప సర్పంచు సూర్యనారాయణ, తహసీల్దారు జయప్రసాద్, వీఆర్వోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని రాచేపల్లి, నిదనవాడ, వెస్ట్ నరసాపురం గ్రామ పంచాయతీల్లో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పంపిణీ చేశారు. రాచేపల్లి, నిదనవాడ పంచాయతీలో ఎంపీటీసీ సునీతమ్మ, మాజీ సర్పంచ్ గంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌పీ నారాయణరెడ్డి, అమర్‌నాథరెడ్డి, వెస్ట్ నరసాపురం పంచాయతీలో సర్పంచ్ వెంకట్రాముడు, పంచాయతీ కార్యదర్శి ఓబిరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

గుంతకల్లుటౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఐటీ విభాగం నాయకులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైద్యరంగం అభివృద్ధికి జగనన్న తీసుకొచ్చిన సంస్కరణలతో ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆస్పత్రిలో వసతులు కల్పించారన్నారు. ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 2వ వార్డు పరిధిలో ఉన్న పిరమిడ్ ఏరియాలో ఏర్పాటు చేసిన వీధి దీపాలను మంగళవారం రాత్రి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రారంభించారు. గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షల వ్యయంతో పిరమిడ్ ఏరియాలో 4 కి.మీ మేర 35 విద్యుత్ స్తంభాలు, 50 వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ మెహరున్నీసా, వార్డు ఇన్‌చార్జ్ పీఎస్ మస్తాన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో మంగళవారం మున్సిపల్ సిబ్బందితో కలసి వైఎస్సార్‌సీపీ నాయకులు చెత్తను తొలగించారు. పార్టీ యువనేత హర్షవర్ధన్ రెడ్డి సూచనల మేరకు చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రభాకర్‌బాబు, వార్డు ఇన్‌చార్జ్ డిష్ సూరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పుట్లూరు: మండలంలోని కడవకల్లు, దోశలేడు, చెర్లోపల్లి, కడవకల్లు తదితర గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను మంగళవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వసతులను ఆరా తీసిన అనంతరం బీఎల్‌ఓల నుంచి ఓటర్ల జాబితా వివరాలను సేకరించారు. అనంతరం కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పామిడమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

పామిడి: పట్టణంలో పామిడమ్మ గుడి నిర్మాణానికి మంగళవారం దివంగత గొందలే కొండప్ప రావు కుటుంబం విరాళం అందజేసింది. ఆయన జ్ఞాపకార్థం భార్య అరుణాబాయి దేవాలయ నిర్మాణానికి రూ.10116 అందజేశారు. ఆమె కుటుంబసభ్యులు జి.రాజశేఖర్, జి.రాజు తదితరులు ఆలయ కమిటీ సభ్యుడు జే నాగరాజారావుకు నగదు అందించారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు రమేష్ బాబు ఆధ్వర్యంలో 54 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రమణ్యం, సభ్యులు విసి మద్దిలేటి, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.